ప్రజాశక్తి
మంగళవారం 20 డిసెంబర్ 2022
5
అల్లూరి సీతారామరాజు



21 నుంచి ఉచిత బియ్యం పంపిణీ

ప్రజాశక్తి పాడేరు: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులైన బియ్యం, కంది పప్పు, పంచదార సరఫరా గడువు ఈ నెల 20వ తేదీ తుది గడువని జిల్లా సంయుక్త కలెక్టర్ జే.శివ శ్రీనివాసు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.కార్డు దారులు మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ వాహనం ద్వారా ఆయా సరుకులను పొందాలని వివరించారు.ప్రధానమంత్రి ఘరీబ్ కళ్యాణ అన్న యోజన పథకం కింద పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం ఈ నెల 21వ తేదీ నుంచి పిఎంజికెఎవై కార్డు దారులకు అందిస్తామని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సంయుక్త కలెక్టర్ జే. శివ శ్రీనివాసు కోరారు. సంబంధిత చౌక ధరల దుకాణం నుండి పిఎంజికెఎవై ఉచిత బియ్యాన్ని ఉచితంగా పొందవచ్చని జే.సి సూచించారు. ఈ నెల 24వ తేదీన జాతీయ వినియోగదారుల దినోత్సవం పురష్కరించుకొని 21వ తేదీన వినియోగదారుల వ్యవహారాల సమన్వయ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంయుక్త కలెక్టర్ శివశ్రీనివాస్ తెలిపారు.

ఓటర్ల జాబితాలు సిద్ధం చేయాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి పాడేరు: ఓటర్ల నమోదు, తొలగింపులు, చేర్పులు మార్పులకు సంబంధించి ఫారం 7,8,9 పెండింగ్ దరఖాస్తులు, జాబితాల పనులు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఎఇఆర్ఓ (తహసిల్దార్లు) లను, సబ్ కలెక్టర్లను ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ఈ నెల 22వ తేదీ తుది గడువుగా నిర్దేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి తహసిల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ మాట్లాడుతూ, జనవరి 5న ఓటర్ల జాబితా తుది ప్రచురణ ఉన్నందున పెండింగ్ ధరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రతి క్లెయిమ్‌తో పాటు సంబంధిత 7,8,9 ఫారం తప్పనిసరిగా ఉండాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున ఓటర్ల జాబితాకు సబంధించిన పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. బిఎల్ఓలు సహకరించకుంటే నిభందనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ పాడేరు జిలాల్లో సందర్శించే అవకాసమున్నందున బిఎల్ఓలు, తహసిల్దార్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంజినీరింగ్ సహాయకులు సహకరించలేదని దుంబ్రిగుడ తహసిల్దార్ కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా కలెక్టర్ స్పందిస్తూ, తహసిల్దార్లు సహాయ ఎన్నికల అధికారులైనందున వారికి సహకరించాల్సిందేనని, లేకుంటే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. పోలింగ్ కేంద్రం వారీగా నివేదికలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో జిల్లా రెవిన్యూ అధికారి బి.దయానిధి, ఆయా మండలాల నుండి తహసిల్దార్లు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలి

పాడేరు : పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సోమవారం గొందూరు సమీపంలో మెట్ట బంగళా వద్ద రోడ్డు పరిసరాలను డివిజనల్ అటవీ శాఖాధికారి వినోద్ కుమార్, పాడేరు ఎంపిడిఓ సాయి నవీన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రహదారి ఇరువైపులా చెత్తను తొలగింపు కార్యక్రమాన్ని కలెక్టర్ జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముందుగా పాడేరు నుండి గరికబంద, అరకు నుండి చిలకలగెడ్డ, పాడేరు నుండి జి.మాడుగుల మధ్య గల ప్రాంతాన్ని క్లీన్ డ్రైవ్ చేపట్టి పైలట్‌గా శుభ్రపరచాలని సూచించారు. ఈ ప్రాంతాలలో ముందుగా 15 రోజులు పరిశీలించి తదుపరి మిగిలిన ప్రాంతాలకు కూడా విస్తంచే విధంగా కార్యాచరణ చేపట్టాలని డిఎఫ్ఓను ఆదేశించారు. ఇందుకు అవసరమైన 47 మంది నిరుద్యోగ గిరిజనులను గుర్తించి వారికి ఉపాధి కల్పించాలని, ఒక్కొక్కరికి రోజుకు రూ.500 లు వేతనం చెల్లించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి రెండు కిలోమీటర్లకు ఒక డంపర్ బిన్ను ఏర్పాటు చేయాలన్నారు. పాడేరు పట్టణంలో ప్రతి దుకాణదారుడూ డస్ట్ బిన్నులు ఏర్పాటు చేసుకొనే విధంగా చైతన్య పరచాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ప్రాంతాలను గుర్తించి వీలైనన్ని మొక్కలు పెంచాలని సూచించారు. అటవీ సిబ్బంది సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ వినోద్ కుమార్, పాడేరు ఎంపిడిఓ సాయి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి

అల్లూరి జిల్లా సిఐటియు తొలి మహాసభలు

పాడేరులో ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు కేంద్రంగా అల్లూరి జిల్లా ఆవిర్భావం తర్వాత ప్రప్రథమంగా సిఐటియు జిల్లా మహాసభలను ఈనెల 20, 21 తేదీలలో నిర్వహిస్తారు. ఈ తొలి మహాసభలకు సీఐటీయూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారు. మహాసభలలో భాగంగా 20న ఉదయం 11 గంటలకు తలారి సింగి జంక్షన్ నుండి పాత బస్టాండ్ మీదుగా సభా స్థలి వరకు కార్మికులు ర్యాలీ నిర్వహిస్తారు. పాడేరు మోదకొండమ్మ ఆలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం వద్ద బహిరంగ సభ తోపాటు రెండు రోజులు సిఐటియు ప్రతినిధుల సమావేశాలు నిర్వహించేందుకు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బోనంగి చిన్నయ్య పడాల్, వి.ఉమామహేశ్వరరావుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణాన్ని కార్మిక చిహ్నం ఎర్రజెండాలతో అలంకరించారు. పాడేరు ఏజెన్సీలోని 11 మండలాల నుంచి వివిధ రంగాల కార్మికులు జిల్లా మహాసభలకు హాజరవుతున్నారు. వివిధ మండలాల్లో సిఐటియు కార్మిక సంఘానికి ప్రాతినిధ్యం వహిస్తున్న 400 మంది మండల ప్రతినిధులు మహాసభలకు హాజరవుతారు. పాడేరు ఏజెన్సీలోని వివిధ రంగాల కార్మికుల ఐక్యత, సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఉద్యమ ప్రస్థానం మొదలై పాతికేళ్ళు దాటింది. సిఐటియు అనుబంధంగా పాడేరు ఏజెన్సీలో 16కు పైగా కార్మిక సంఘాలు ఉన్నాయి. వివిధ రంగాల్లోని సుమారు పది వేల మంది కార్మికులు సిఐటియు సభ్యత్వం కలిగి ఉన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో స్కీం వర్కర్లుగా పని చేసే కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికులు అసంఘటిత రంగ కార్మికులు సుమారు 50 వేలకు పైగా కార్మికులు పాడేరు ఏజెన్సీలో ఉన్నారు.



జెసిబితో గండి పూడ్చుతున్న దృశ్యం

పవర్ కెనాల్ గండి పూడ్చే పనుల ప్రారంభం

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ పరిధిలో దిగువ సీలేరు డొంకరాయి పవర్ కెనాల్‌కు ఇటీవల పడిన గండిని పూడ్చే పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎపి జెన్‌కో ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ మరమ్మతు పనులకు ఏపీ జెన్కో ఉన్నతాధికారుల నుంచి అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. కెనాల్ గండి మరమ్మతు పనులు స్థానిక కాంట్రాక్టర్లకే అప్పచెప్పమన్నారు. ఇంజనీర్ల నిరంతర పర్యవేక్షంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఎటువంటి అపోహాలకు తావు లేకుండా పనులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



మరమ్మతులకు గురై ఘాట్ రోడ్డులో నిలిచిపోయిన విశాఖ-భద్రాచలం బస్సు

2.30 గంటల పాటు ఘాట్ రోడ్డులో

నిలిచిపోయిన విశాఖ- భద్రాచలం బస్సు

ప్రజాశక్తి -సీలేరు

విశాఖ నుంచి భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురై జికె.వీధి మండలం సప్పర్ల సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. విశాఖపట్నం డిపో చెందిన ఈ బస్సు సోమవారం ఉదయం 5 గంటలకు విశాఖలో బయలు దేరింది. సాయంత్రం 5 గంటలకు భద్రాచలం చేరాల్సి ఉంది. అయితే సప్పర్లకు ముందు మూడు కిలోమీటర్ల దూరంలో బస్సు బ్రేక్ డ్రమ్ములు పట్టేసి ప్రధాన రహదారి మధ్యలో 2.30 గంటల పాటు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సాంకేతిక లోపల సవరించడానికి వారి దగ్గర సరైన పనిముట్లు కూడా లేకపోవడంతో మరింత జాప్యం జరిగింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఇదే సమయంలో విశాఖపట్నం డిపో చెందిన భద్రాచలం నుంచి విశాఖపట్నం వెళ్లే బస్సు రావడంతో అది వెళ్లేందుకు మార్గం లేకపోయింది. దీంతో ప్రధాన రహదారికి పక్కనే ఉన్న చెట్లను తొలగించారు. నిలిచిపోయిన బస్సు సాంకేతిక లోపాలు సవరించిన మధ్యాహ్నం 3.30 గంటలకు సీలేరు చేరింది. సీలేరుకు ఒంటిగంటకు రావాల్సిందిగా బస్సు 3.30కు రావడంతో ప్రయాణికులు భోజనాలు లేక ఆకలితో అలమటించారు. ఈ మార్గంలో డొక్కు బస్సులు నడపడం వల్ల ప్రమాదవస్తు ఏ లోయలో పడి ఉంటే ప్రయాణికులు ప్రాణాలు గాల్లో కలిసి పోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కండిషన్ ఉన్న బస్సులను ఈ మార్గంలో నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

పలువురు పేదలకు రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-హుకుంపేట: ఏసుక్రీస్తుని జీవితంలో అంగీకరించినప్పుడే నిజమైన క్రిస్మస్ ఆనందాన్ని పొందుతామని టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సివేరి దొన్ను దొర అన్నారు. మండలంలోని పట్టం పంచాయతీ కుమార్ పుట్టు గ్రామంలో సోమవారం ఘనంగా క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాస్టర్. సంసన్ రిసార్ట్ వాఖ్య సందేశాన్ని అందించారు. అనంతరం క్రిస్మస్ వేడుకల సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. వృద్ధులకు రగ్గులు, చీరలను దొన్ను దొర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ యోహన్, టిడిపి ఎస్టి సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొర్ర సంతోష్ కుమార్, అధికార ప్రతినిధి శంకర్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న దొన్ను దొర



పార్కింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

బొర్రా గుహల వద్ద

వాహనాల పార్కింగ్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -అనంతగిరి: బొర్రా గుహల వద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించామని స్థానిక సర్పంచ్ జన్ని. అప్పారావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బొర్రా గుహల సందర్శనకు వచ్చే టూరిస్టుల వాహనాల నిలుపు స్థలం లేక అవస్థలు పడుతున్నారని, ఈ ఉద్దేశంతో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశామన్నారు. బైకుకు రూ. 10, ఆటో రూ.20, కారులకు రూ.30 నుండి 50 రుసుము వసూలు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటాల ఫలితంగానే

కాఫీ కార్మికులకు కూలి రేట్లు పెంపు

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలోని ఏపీఎఫ్‌డిసి ఎస్టేట్‌లలో పని చేస్తున్న కాఫీ కార్మికులు దశల వారి పోరాటాల ఫలితంగా కూలి రేట్ల పెంపును సాధించు కున్నారు. ఈ విషయమై సోమవారం కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సుందరరావు మాట్లాడుతూ, కూలి రేట్లు పెంచాలని తాము చేసిన ఆందోళన ఫలించిందని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం చేయాలని గత నెల 18న అన్ని డివిజన్ కేంద్రాలలో అధికారులకు వినతిపత్రాలు అందించామని తెలిపారు. దీంతో కార్మికుల కూలి రేట్లు, పండ్ల సేకరణ రేటు పెంచుతూ సోమవారం జీవో జారీ చేశారన్నారు. గతంలో పళ్ళ సేకరణకు ఐదు రూపాయల 19 పైసలు ఇచ్చేవారని, కొత్త వీడిప ప్రకారం ఐదు రూపాయల 60 పైసల వరకు, రోజువారి కూలీ రేట్లు రూ.273 నుంచి సుమారుగా రూ.299.14లు పెరిగినట్లు తెలిపారు.ఇదే కాకుండా వివిధ స్థాయిలో ఉన్న సమస్యలు పరిష్కారం చేయాలని డివిజన్ స్థాయి అధికారులకు విన్నవించడం జరిగిందన్నారు. ప్రధానంగా కాఫీ తోటల్లో క్షేత్రస్థాయి సిబ్బందిని వెంటనే నియామకం చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో కాఫీ కార్మికులు భీమరాజు, దేవి, వరలక్ష్మి, కాంతమ్మ, కృష్ణ బాబు, కోటి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాలికి లక్కు పాల్గొన్నారు.



రోడ్డు పనులు చేపడుతున్న గిరిజనులు

శ్రమదానంతో రోడ్డు పనులు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీ పరిధి బోరింగ్‌వలస, జామగుడ గిరిజన ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రోడ్డు పనులను చేపట్టారు. రోడ్డు మార్గంలో బండలను తొలగించారు. సుమారు 60.వేలల ఖర్చుతో శ్రమదాన పనులు నెల రోజుల నుండి పనులు చేస్తున్నారు. తమ గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు పలుమార్లు లిఖితపూర్వకంగా విన్నవించినప్పటికీ పట్టించుకోలేదని గిరిజనులు తెలిపారు.తక్షణమే ప్రభుత్వం స్పందించి పూర్తి స్థాయి రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరారు.

30న ఆదివాసి గర్జన బహిరంగ సభ

ప్రజాశక్తి-జి.మాడుగుల: బోయ, వాల్మీకి, ఇతర కులాలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని సహించబోమని, ఈ విషయమై ఈనెల 30న పాడేరు జూనియర్ కళాశాల మైదానంలో జరగనున్న ఆదివాసి గర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎపి ఆదివాసి జెఎసి జిల్లా కన్వీనర్ రామారావుదొర, సోమవారం ప్రకటనలో కోరారు.స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ, మంత్రులు చట్ట సభల్లో మాట్లాడక పోవడంతోనే పాలకులు హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని తెలిపారు.శ్యామ్యూల్ ఆనంద్ కమీషన్‌ను తక్షణమే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ముందుగా మండల కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూటియు జిల్లా ప్రతినిధి కూడా చిట్టి బాబు, ఎస్టీ ఉద్యోగుల యూనియన్ మండల అధ్యక్షులు పూజారి చిట్టిబాబు, జేఏసీ నాయకులు వెచ్చంగి నానిబాబు, రామకృష్ణ, దేవదాసు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలి

ఐటిడిఎ పిఒకు గిరిజన సంఘం వినతి


ప్రజాశక్తి -రంపచోడవరం

మండలంలోని కాకవాడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో లైంగిక వేధింపులకు సంబంధించిన ఎపిసోడ్‌లో ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు ఎందుకు ఇచ్చారని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఇ. సిరిమల్లి రెడ్డి ప్రశ్నించారు. ఉపాధ్యాయులను పూర్తి బాధ్యులను చేస్తూ షోకాజ్ నోటీసులు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం ఐటిడిఎ పిఒ వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ కాకవాడ ఆశ్రమ ఉన్నత పాఠశాల లైంగిక వేధింపుల సంఘటనపై విద్యార్థులకు అండగా నిలిచిన, ఎస్టీ కమిషన్‌నకు, అధికారులకు విద్యార్థుల బాధలను చెప్పిన ఉపాధ్యాయులపై షోకాజ్ నోటీసులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. ఇలా చేయడం వల్ల విద్యార్థులకు అండగా ఉన్న ఉపాధ్యాయుల గొంతు నొక్కడమే అవుతుందని పేర్కొన్నారు. తక్షణమే ఉపాధ్యాయులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని, ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా సహాయక కార్యదర్శి తీగల శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు ఆవుల ధర్మా రెడ్డి, మండల అధ్యక్షులు సాదల విద్యా సాగర్ రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ కుర్ల అబ్బాయి రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మల్లెతోటలో ఆర్ఓ ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని మల్లెతోట గ్రామంలో ఆర్ఓ ప్లాంట్‌కు మరమ్మతులు చేయాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి కారం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మల్లెతోట గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వరద ముంపులో ఆర్ఓ ప్లాంట్ పూర్తిగా మునిగిపోయి, నాటి నుండి పనిచేయటం లేదని తెలిపారు. ఇప్పటికీ 5 నెలలైనా సచివాలయం సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు దీని గురించి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ పైపులైన్ల సగం వరకు ఏర్పాటు చేసి, టేప్స్ వేయకుండా మధ్యలోనే విడిచిపెట్టారని తెలిపారు. దీంతో నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్ఓ ప్లాంట్, జల్ జీవన్ మిషన్ పనులను తక్షణమే పూర్తి చేయాలని, లేకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు ధర్మల మల్లయ్య, వీర భద్రం, రామయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆర్ఓ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న గిరిజన సంఘం నేత నాగేశ్వరరావు తదితరులు

స్పందన అర్జీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

ప్రజాశక్తి - రంపచోడవరం

స్పందన కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక ఐటిడిఏ సమావేశ మందిరంలో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, పలువురు అధికారులతో కలిసి జెసి స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి 55 దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన దరఖాస్తులు ఎక్కువగా వచ్చాయి. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధించిన సమస్యల్లో అవకాశం ఉన్నవాటిని వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటికి పరిష్కారమార్గాలు అన్వేషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, డిఎల్‌పిఓ జాన్ విల్సన్, ఏడిఎంహెచ్‌వో డాక్టర్ అనూష, డాక్టర్ సతీష్. పశుసంవర్ధక శాఖ వైద్యాధికారులు డాక్టర్ గోపిక, పీహెచ్ఓ కె.చిట్టి బాబు, సిడిపిఓ, సంధ్యారాణి, డిపిఎం అపర్ణ, వ్యవసాయశాఖాధికారి రాంబాబు, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి -సీలేరు

గిరిజన ప్రాంతాల్లో వివిధ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు భారతీయ ఆదివాసీల సమైక్య ఎపి రాష్ట్ర అధ్యక్షుడు గడుతురు రాంగోపాల్ సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. పాడేరు ఐటిడిఏ క్వార్టర్స్‌లో బయట వ్యక్తులు ఉండడం వలన ప్రభుత్వ ఉద్యోగులకు వసతి సౌకర్యాలు లేక తీవ్రమైన ఇబ్బందులు గురవుతున్నారని ఆ వినతిలో పేర్కొన్నారు. చింతపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లో బయో స్పియర్ రిజర్వ్‌గా ప్రకటించాలని కోరారు. గిరిజనులు సాగు చేస్తున్న పసుపు పంటకు జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్ లభించేలా ప్రయత్నాలు చేయాలన్నారు. వీటికి కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు రామ్ గోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మర్రి కామరాజు సత్యనారాయణ, లాకే భాస్కరరావు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగలక్ష్మి

పేదల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. సోమవారం మండలంలోని మారేడుబాక పంచాయతీ ఊర్లాకులపాడు, జి.శరభవరం, కోసూరివారి వీధి గ్రామాలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడపగడపకు వెళ్లి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కోసూరివారి వీధిలో చిన్నారి తలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా తక్షణమే వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో సిసి రోడ్లు నిర్మించాలని ఊర్లాకుల పాడులో అంగన్వాడి భవనం నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జడ్పిటిసి ఒడుగుల జ్యోతి, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, సొసైటీ అధ్యక్షులు సింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్ తొంట ఆదిరాజు, ఎంపీడీవో బాపన్న దొర, డిప్యూటీ తాహసిల్దార్ అల్లు సత్యనారాయణ, ఈఓపిఆర్డి వెంకట శ్రీనివాస్ రావు, పలు పంచాయితీల సర్పంచ్‌లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బాలరాజు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ కాలనీలో అనారోగ్యంతో సోమవారం మృతి చెందిన మత్స్యరాస బాలరాజు కుటుంబాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు పరామర్శించారు. బాలరాజు మృతదేహంపై పూల గుచ్చాలు వేసి ఘన నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎ ఇఎఫ్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ పడాల్ తదితరులు పాల్గొన్నారు.



బాలరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు విశ్వేశ్వర రాజు



మాట్లాడుతున్న శివ ప్రసాద్

వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి- పెదబయలు రూరల్ :మండలం కేంద్రంలోని గిరిజన సంక్షేమ వసతి గృహంలో వినియోగదారుల దినోత్సవాన్ని ఆ సంఘం అధ్యక్షులు పాంగి శివ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించారు. బజారులో ఏదైనా వస్తువు కొనేటప్పుడు జాగ్రత్తగా గమనించి ఆలోచించి కొనుగోలు చేయాలని సూచించారు. ముఖ్యంగా కాలపరిమితి చూసి కొనుగోలు చేయాలన్నారు.

21న అబ్జర్వర్ పర్యటన

ప్రజాశక్తి -పాడేరు:ఈ నెల 21న ఎలక్ట్రోల్ అబ్జర్వర్ ఏ బాబు జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదే రోజు ఉదయం విశాఖపట్నం నుండి బయలు దేరి 10గంటలకు పాడేరు చేరుకొని అధికారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం 11.15 నుండి 11.30 వరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర వర్గాల నుండి ఫిర్యాదులు, సలహాలు, స్వీకరిస్తారని కలెక్టర్ వివరించారు. మధ్యాహ్నం 12.00 గంటల నుండి 2గంటల వరకు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి భోజనానంతరం విశాఖపట్నం బయలు దేరి అక్కడి నుండి విజయవాడ వెళ్తారని కలెక్టర్ తెలిపారు.

ఐద్వా జాతీయ సభలను జయప్రదంచేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో జనవరి 6 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఐద్వా అఖిలభారత 13వ మహాసభలను జయప్రదంచేయాలని కోరుతూ ఐద్వా జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యాన సోమవారం పందిమెట్ట ఏరియాలో ఐద్వా సీనియర్ నాయకులు ఆదిలక్ష్మి పతాకాన్ని ఎగురవేశారు. ఇదే సందర్భంగా ఐద్వా ఉద్యమ నిర్మాత సుశీలాగోపాలన్ 22వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు బి.పద్మ మాట్లాడుతూ, సుశీలాగోపాలన్ మహిళా ఉద్యమం వ్యవస్థాపకుల్లో ఒకరన్నారు. 1981లో ఐద్వా అఖిలభారత మొదటి ప్రధాన కార్యదర్శిగా, తుది శ్వాస విడిచే వరకు అఖిల భారత అధ్యక్షులుగా పనిచేశారని గుర్తుచేశారు. పేద కార్మికుల సమస్యలపై సంఘాలు పెట్టించి నిరంతరం పనిచేశారని, మూడుసార్లు ఎంపీగా గెలిచారన్నారు. మహిళా రక్షణ చట్టాల అమలు కోసం ప్రస్తుత పరిస్థితుల్లో బలమైన మహిళా ఉద్యమం అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జోన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.మణి, ఆర్.వరలక్ష్మి, బి.సత్యవతి, సరస్వతి, లక్ష్మి పాల్గొన్నారు.

ఫోక్సో కేసులో నిందితునికి 20 ఏళ్ల శిక్ష

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం హెచ్‌బి కాలనీలో 9వ తరగతి బాలికను పాఠశాల సమయం ముగిసిన తర్వాత చాక్లెట్ ఇస్తానని ప్రలోభపెట్టి 2020 డిసెంబర్ 15న అత్యాచారానికి పాల్పడిన సంఘటనలో సారిక వెంకటరమణ (66)కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష రూ.200 జరిమానా, రూ.4 లక్షల పరిహారం బాధితురాలికి చెల్లించాలని పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కె.రామశ్రీనివాస్ సోమవారం తీర్పును వెలువరించారు. అప్పట్లో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు బీపీ ఎస్ఐ ప్రేమ్ కాజల్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించిన సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. కోర్టులో విచారణ చేపట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి సోమవారం పై విధంగా తీర్పును వెలువరించారు.

భూముల రీ సర్వేపై అవగాహన పెంచాలి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్షణ జరుగుతున్న భూముల రీసర్వేపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మండలాల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపీడీవోలతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, రీసర్వే వల్ల కలిగే లాభాలను రైతులకు తెలియజేయాలన్నారు. అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. సర్వే పూర్తయితే భవిష్యత్‌లో ఏ విధమైన భూ సమస్యలు రావన్నారు. విస్తీర్ణం, భూమి సంక్రమించిన విధానం, సర్వే నెంబరు ఖాతా నంబర్లతో పాటు సరిహద్దులు, భూమి మ్యాప్ కూడా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో జెసి కల్యాణకుమారి, డిఆర్‌ఒ పి.వెంకటరమణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుపై

ఎంపీ, ఎమ్మెల్యేల వైఖరి స్పష్టం చేయాలి

ప్రజాశక్తి -పాడేరు: హైడ్రో పవర్ ప్రాజెక్టును మోడీ ఆదేశాలతో కార్పొరేట్ మాఫియా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడంపై అధికార పార్టీ వర్గాలు వ్యతిరేకించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి సత్యనారాయణ, పాడేరు మండల కార్యదర్శి కూడా రాజాక్షి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్టును మోడీ తన మిత్రులైన ఆదానీ, శ్రీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్‌కు అప్పగించాలని ఒత్తిడి కారణంగా రాష్ట్ర ప్రభుత్వం తన రాజకీయ లబ్ది కోసం కోసం క్యాబినెట్ లో ఆమోదించిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం 1/70 చట్టానికి విరుద్ధమని, 5వ షెడ్యూల్ నిబంధనలకు వ్యతిరేకంగా హైడ్రో పవర్ ప్రాజెక్టు కార్పొరేట్ సంస్థలకు అప్పగించడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. గతంలో అనంతగిరి కొండల్లో టాటా బిర్లా కంపెనీకి బాక్సైట్ తవ్వకాలకు లీజ్ ఇవ్వడాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసిందన్నారు. గిరిజన గ్రామ సభ నిర్వహించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ అప్పగించడం సరి కాదన్నారు. అటవీ హక్కుల చట్టం, 1/70 చట్టాన్ని గిరిజన ప్రాంతాల్లో అమలు లో ఉనా లెక్క చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసుల అస్తిత్వానికే భిన్నంగా వ్యవహరించడం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో ముచ్చల లక్ష్మణరావు, బి రాజు పాల్గొన్నారు.

ప్రాజెక్టు కోసమే లంబసింగిలో అవుట్ పోస్ట్

జగన్ దూతగా రోజా పర్యటన

ఏపీ గిరిజన సంఘం నేతల ధ్వజం

ప్రజాశక్తి-పాడేరు: హైడ్రోపవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం అడ్డంకులు లేకుండా చేసుకోవడానికి, దీనిపై గిరిజనులు చేసే ఉద్యమాలను అణచివేసేందుకే లంబసింగిలో అవుట్ పోస్ట్ ఏర్పాటు చేస్తున్నారని ఆంధ్ర ప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, పర్యాటక శాఖ మంత్రి రోజా పర్యటించింది కూడా లంబసింగిలో అవుట్ పోస్ట్ ఏర్పాటు కోసమేనని, జగన్మోహన్ రెడ్డి పంపించిన దూతగా వచ్చారని ధ్వజమెత్తారు. పర్యాటకుల శాంతిభద్రతల పరిరక్షణ కోసం అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయలేదని, ఆ ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అడ్డంకులను తొలగించు కునేందుకు చేస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాలికి లక్కు పాల్గొన్నారు.



సిపిఎం ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న మత్స్యకారులు

గ్యాస్ యూనిట్‌ను తొలగించాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఫిషింగ్ హార్బర్ ప్రాంతం 37వ వార్డు పరిధి కొత్త అగ్రహారంలో జనవాసాల మధ్య ఉన్న నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రైనింగ్ యూనిట్ విషవాయులను విడుదల చేస్తూ, ఆ ప్రాంతంప్రజల ఆరోగ్యాలకు తీవ్రహాని కలిగిస్తుందని, దానిని తక్షణం అక్కడి నుంచి తొలగించాలని సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. గ్యాస్ యూనిట్ తరలించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విష వాయువుల లీక్ వల్ల ఎంతోమంది అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. వాంతులు, చర్మవ్యాధులకు గురైనా స్థానిక కార్పొరేటర్, మంత్రులు సంఘటనా స్థలాన్ని పరిశీలించలేదన్నారు. బాధితులను పరామర్శించకపోవటం శోచనీయం అని పేర్కొన్నారు. బాధితులకు కనీస వైద్యం అందివ్వవలేదని తెలిపారు. అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం సంఘటన స్థలానికి చేరుకొని, పరిశీలించి విష వాయువులను విడుదల చేసిన సంస్థను తొలగించాలని డిమాండ్ చేశారు. విష వాయువుల లీకేజీకి కారకులైన వారిపై చర్యలు తీసుకొని, బాధితులకు నష్టపరిహారం, వైద్య సదుపాయం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మల్లికార్జునను కలిసి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జగదాంబ జోన్ అధ్యక్షుడు ఎం.సుబ్బారావు, ఎపి మత్స్యకారులు-మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి చంద్రశేఖర్, నాయకులు ఆర్.తాతారావు, చింతపల్లి అమ్మోరు, రాగతి అర్మిల, బాధితులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే గొల్ల బాబురావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాబురావు మాట్లాడుతూ, రైతుల వద్ద ఉన్న ప్రతి గింజా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. గత ఖరీఫ్ సీజన్లో కొనుగోలు చేసిన ధాన్యంకు సొమ్ము నేటికీ చెల్లించకపోవడం పట్ల పలువురు రైతులు తన దృష్టికి తీసుకు వస్తున్నారని బకాయిలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారిని అరుణ కుమారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, తహాశీసిల్దార్ జానకమ్మ, మండల ఉపాధ్యక్షులు దత్తుడు రాజు అధికారులు పాల్గొన్నారు,

రావికమతం:మండలంలోని చినపాచీల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రావికమతం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కంచిపాటి జగ్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు పండించిన వరి ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులందరూ రైతు భరోసా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏ గ్రేడు క్వింటా ధాన్యానికి రూ.2060, సాదా ధాన్యం క్వింటాకు రూ.2040 చొప్పున ధర చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ పర్సన్ ఇంచార్జ్ కొమార ప్రసాదు, సర్పంచ్‌లు దాసరి వరహాలు, రవికుమార్, బంటు సన్యాసినాయుడు, కలిగిరి ప్రసాద్, కోమిర ఎంపీటీసీ బంటు శ్రీనివాసరావు పిఎసిఎస్ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్ఎన్ఐఎల్, ఆంధ్రా యూనివర్సిటీ అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఎన్ఐఎల్), ఆంధ్రా యూనివర్శిటీ మధ్య సోమవారం ఎయులో పరిశ్రమ-అకాడమియా ఇంటర్‌ఫేస్ , పరిశోధన, అభివృద్ధి సర్వేలు, ప్రాజెక్టులు, సర్వేలలో సహకారం కోసం ఉమ్మడి కార్యక్రమాల పురోగతి, పెంపుదల అంశాలపై అవగాహనా ఒప్పందం జరిగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి డా.పి.వి.జి.డి. ప్రసాద్ రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ వి.కృష్ణ మోహన్, ఆర్ఐఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ జి. గాంధీ ఎమ్‌ఒయుపై సంతకాలు చేశారు.

సౌకర్యాల కల్పనకు కృషి : ఎమ్మెల్యే ఫాల్గుణ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఫాల్గుణ

ప్రజాశక్తి - పెదబయలు :మండలంలోని మారుమూల మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో అరకు ఎమ్మెల్యే ఫాల్గుణ సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. చింతగరువు, గిన్నెలకోటలో గడప గడప కు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అవలంభిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. గిన్నెలకోట గ్రామ సమీపంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణ మైతే గిన్నెలకొట, జామిగుడ, భూసిపుట్ పంచా యతీలకు రవాణాకి వీలు కలుగుతుందన్నారు.పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మారుమూల ప్రాతాల్లో మౌలిక సదుపాయలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ బాలం నాయుడు, మండల కన్వీనర్ కొర్ర కనకరాజు, ఎంపీటీసీ గడుతురి నిర్మల, మాజీ జెడ్పీటీసీ కొంటా సూర్యనారాయణ, సర్పంచుల పోరం అధ్యక్షుడు కె.సురేష్ పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- జి.మాడుగుల: మండలం పెదలువ్వాసింగి పంచాయతీ ఎస్తాలు గ్రామంలో స్థానిక సర్పంచ్ కె.సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ జి.సన్యాసిదొరలు మన బడి నాడు నేడులో భాగంగా పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సన్యాసిదొర మాట్లాడుతూ, శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవతో ఎస్తాలు గ్రామానికి రూ.38 లక్షలు మనబడి నాడు నేడు కింద నిధులు కేటాయించినట్టు తెలిపారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందన పాత్రుడు, ఉప సర్పంచ్ జి.గణపతి, ఎస్.నీలకంఠం పాల్గొన్నారు



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

అంగన్‌వాడీ కేంద్రాలు సందర్శన

ప్రజాశక్తి - పెదబయలు: పెదబయలు, ముసిదిపుట్టు, సీతగుంట, కిలగాడా అంగన్ వాడీ కేంద్రాలను శిశు సంక్షేమ అధికారి సూర్యలక్ష్మీ సోమవారం సందర్శించారు. మెనూ అమలుపై అడిగి తెలుసు కున్నారు. రికార్డులు తనిఖీ చేశారు. ఆమె వెంట సిడిపి ఓ ఎన్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన సూర్యలక్ష్మి

సమస్యలపై గిరిజనుల ధర్నా



ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని పెద్దపాడు, చెరుపాలెం, దోకులపాడు, కాకవాడ పంచాయతీ వెట్టిచెలకలు, రాకోట, వేములకొండ తదితర 10 గ్రామాల ప్రజలపై సమస్యలపై సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యాన ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయని, ప్రయాణికులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని, రోడ్ల పనులు వెంటనే ప్రారంభించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఐటిడిఎ ప్రాజెక్టు అధికారికి వినతి పత్రాన్ని అందించారు. దీనికి పిఒ స్పందిస్తూ తక్షణమే గ్రామాల్లో పర్యటిస్తామని, అన్ని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సాదల విద్యాసాగర్ రెడ్డి, తీగల శ్రీను, ఆవుల ధర్మారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు

అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ప్రజాశక్తి -ఆనందపురం : గ్రామపంచాయతీల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు సోమవారం వేములవలస పంచాయతీలో వేములవలస సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లీనిక్‌ను ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనందపురం మండలంలో ఇప్పటి వరకూ రూ.170 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు వేములువలస, బిపి కళ్ళాలలో రూ.23 కోట్లు తో పార్టీలకతీతంగా .అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఏడాదికి రూ.రెండు కోట్ల వరకు ఆదాయం వచ్చిన వేములవలస పంచాయితీ పాలకవర్గం నిధులు సద్వినియోగం చేసుకోకపోవడంపై మండిపడ్డారు.

జెడ్‌పిటిసి కోరాడ వెంకటరావు మాట్లాడుతూ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న వేములవలసలో జగనన్న ఇళ్ల పట్టాలు సమస్యను పరిష్కరించాలని కోరారు. జాతీయ రహదారి పనులు సక్రమంగా చేపట్టకపోవడం వల్ల ఆనందపురం కూడలిలో ట్రాఫిక్ అస్తవ్యవస్థంగా తయారైందని, ఇక్కడ ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని కోరారు బీపీ.కళ్లాలు సర్పంచ్ కోన పైడిరాజు మాట్లాడుతూ, రు వేములవలస మార్కెట్ ఆదాయంలో కొంతైనా తమ పంచాయతీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. వైసిపి నేత మణిశంకర్, భీమిలి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, తహాశీల్దార్ లోకవరపు రామారావు, ఎంపిడిఓ లవ రాజు, ఎంపిపి డాక్టర్ మజ్జి శారదా ప్రియాంక, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను బొట్ట ధనలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు బంక సత్యనారాయణ, వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, మజ్జి వెంకట్రావు, జి.శ్రీను, బిఆర్‌బి నాయుడు, కోరాడ అచ్యుత, రాంబాబు సూర్యకుమారి, శ్రీను, కోరాడ ముసలి నాయుడు, కోరాడ అప్పలస్వామినాయుడు, చందక లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం సచివాలయ ఆవరణలోమొక్కలు నాటారు.

బాబోయ్ కోతులు..

హడలెత్తిస్తున్న వానరాలు

ఇబ్బంది పడుతున్న ప్రజలు



గుంపులుగా గ్రామంలో ఇళ్లపై సంచరిస్తున్న కోతులు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండల కేంద్రంలో కోతులు హడలెత్తిస్తున్నాయి. వీటి సంతతి రోజు రోజుకూ ఎక్కువైంది. ఇవి విచ్చలవిడిగా సంచరిస్తూ దాడి చేస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రం కొయ్యూరుతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో కోతుల సంచారం పెరిగింది. ఆదమర్చితేచాలు ఈ కోతులు ఇళ్లలోకి, వ్యాపార దుకాణాల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఇళ్లలోని గృహోపకరణాలతో పాటు ఆహార పదార్థాలను ధ్వంసం చేస్తున్నాయి. కోతులబారి నుండి రక్షణ పొందేందుకు గృహాలకు, వ్యాపార సముదాయాలకు డబ్బులు వెచ్చించి రక్షణ వలయాలను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. కోతులు చిన్నపిల్లలపై దాడి చేస్తున్నాయి. దీంతో ఇప్పటికే పలువురు చిన్నారులు గాయాలతో ఆసుపత్రులపాలయ్యారు. కొత్తగా మండల కేంద్రానికి వచ్చే వ్యక్తులు ఈ కోతులను చూసి హడలిపోతున్నారు. ప్రజలను కోతులు పెడుతున్న ఇబ్బందులను గుర్తించిన వివిధ పార్టీల నేతలు గత ఎన్నికల సమయంలో కోతులను నియంత్రించే చర్యలు చేపడతామంటూ ఎన్నికల హామీల్లో ఒకటిగా చేర్చి లబ్ధిపొందారు. కాని ఎన్నికలు ముగిశాక ఈ కోతుల నియంత్రణకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కోతుల సమస్యను తీవ్రంగా పరిగణించి నియంత్రణా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టు మధ్యలో భారీ రంధ్రం



రహదారి మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న రంధ్రం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి నుండి కొండవాడ, ఉత్తలూరు గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. గత ప్రభుత్వం హయాంలో పంచాయతీరాజ్ శాఖ నిర్మించిన ఈ గ్రావెల్ రోడ్డు నాణ్యత లేకపోవడంతో రాళ్లు తేలిపోయి ప్రయాణానికి నరకప్రాయంగా ఉంది. దీనికి తోడు కొండవాడ నుండి ఉత్తలూరు మధ్య జమ్మి చెట్టు కాలువ వద్ద నిర్మించిన కల్వర్టు మధ్యలో ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆ రెండు గ్రామాల ప్రజలు మైదాన ప్రాంతానికి రావాలంటే ఈ రహదారి తప్ప వేరే మార్గం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాణ్యమైన కల్వర్టు, రహదారుల నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.

శానిటేషన్ ఉద్యోగికి బుల్లెట్ గాయాలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : పందిని కాల్చే బుల్లెట్ గోడకు తగిలి విచ్ఛిన్నమై, ఆ ముక్కలు తగలడంతో జివిఎంసి ఎనిమిదోవార్డు పరిధిలో శానిటేషన్ విభాగం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. కాపులపాడు డంపింగ్ యార్డ్ వద్ద జరిగిన సంఘటన వివరాలివి.

సోమవారం జివిఎంసి కమిషనర్ పి.రాజబాబు కాపులుప్పాడ డంపింగ్ యార్డు పర్యటన అనంతరం కమిషనర్‌తో వచ్చిన సిబ్బంది అక్కడ సంచరిస్తున్న పందులను కాల్చే పనిని చేపట్టారు. ఈ క్రమంలో ఒక పందిని షూట్ చేయగా, దానికి తగిలిన బుల్లెట్ తర్వాత గోడను తాకి ముక్కలుకాగా, ఆ ముక్కలు అక్కడే తడిపొడి చెత్తను వేరుచేస్తున్న శానిటేషన్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి పెదవాల్తేరుకు చెందిన చెవ్వేటి బాలప్రవీణ్‌ను తాకాయి. ఈ ఘటనలో ప్రవీణ్ వీపునకు నాలుగుచోట్ల, చేతిపై రెండు చోట్ల బుల్లెట్ గాయాలయ్యాయి. గాయపడిన ప్రవీణ్‌ను వెంటనే గాయత్రి ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న మధురవాడ జోన్ సిఐటియు నేత పి రాజ్‌కుమార్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రవీణ్‌కు ప్రమాదమేమీ లేనప్పటికీ, శరరంలో చొచ్చుకుపోయిన బుల్లెట్ ముక్కలను వెంటనే తీయాలని, మెడికవర్ ఆసుపత్రికి తరలించాలని వైద్యులు సూచించగా, సిఐటియు నేతలు జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, ఎంఎహెచ్‌ఒ కిశోర్‌ను సంప్రదించి క్షతగాత్రుడు బాలప్రవీణ్‌ను మెడికవర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు.



వీపుపై బుల్లెట్ ముక్కల గాయాలు, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

కోర్టు ఉద్యోగాలకు 21 నుంచి రాతపరీక్షలు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం, జిల్లా కోర్టులలో ఉద్యోగాల భర్తీకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 21 నుంచి రాత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సోమవారం ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరు కాబోయే అభ్యర్థులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంక్ పాస్‌బుక్స్ వంటి తమ స్వీయ అధికృత నకళ్లను పరిశీలన కోసం పరీక్ష కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. పరీక్ష హాల్‌లోకి ఎలక్ట్రానిక్ సంబంధిత పరికరాలు, చేతి వాచీలు, బ్యాగులు, మనీ పర్సులు వంటి వస్తువులను అనుమతించబోరన్నారు. పరీక్ష ప్రారంభానికి పావుగంట ముందే గేట్లు మూసేస్తారని,అభ్యర్థులంతా నిర్ణీత సమయానికి 30 నిమిషాల ముందుగా పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు.

షిప్‌యార్డు సమస్యలపై వినతి

ప్రజాశక్తి- ములగాడ :హిందూస్థాన్ షిప్‌యార్డ్ ఎల్అండ్ ఎం సీరిస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గుర్తింపు యూనియన్ నాయకులు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలును ఢిల్లీలోని అతని కార్యాలయంలో ఎమ్మెల్సీ పివిఎస్.మాధవ్‌తో కలిసి వెళ్లి షిప్‌యార్డు సమస్యలపై విన్నవించారు. తర్వాత రక్షణశాఖ ప్రొడక్షన్ విభాగం అడిషనల్ సెక్రటరీ టి.నటరాజన్‌ను కలిసి, ఎల్అండ్ఎం సీరీస్‌ను రెగ్యులర్ విషయంపై మాట్లాడారు.గుర్తింపు యూనియన్ నాయకులు రమణమూర్తి, చంటిబాబు, రమేష్, రాజాన అప్పారావు ఉన్నారు.

170 మంది గీతం ఎంబిఎ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ద్వారా ఎంబిఎ, తదితర మేనేజ్‌మెంట్ కోర్సులు అభ్యసిస్తున్న 170 మందికి పైగా విద్యార్థులకు ప్రాంగణ నియామకాలలో ఉద్యోగాలు లభించినట్లు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ డైరక్టర్ సోమయాజుల వంశీకృష్ణ తెలిపారు. డెలాయిట్, ఎడిపి, ఎర్నస్ట్ అండ్ యంగ్, టాటా కన్జూమర్ ప్రోడక్ట్స్, యుటిఐ ఎస్సెట్‌మేనేజ్‌మెంట్, పర్‌ఫెట్టి అండ్ సీషెల్ లాజిస్టిక్స్, ఆక్సెన్ పార్ట్‌నర్స్, బజాజ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫోఎడ్జ్, కెపిఎమ్‌జి వంటి ప్రముఖ కంపెనీలతో పాటు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తదితర సంస్థల్లో మార్కెటింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్, సీనియర్ ఎగ్జిక్యూటివ్, ఆపరేషన్స్, ఫైనాన్స్ వంటి ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీటిలో ఎర్నస్ట్ అండ్ యంగ్ కంపెనీ గీతం విద్యార్థులకు రూ.11.59 లక్షలు, ఇంటెలి ప్యాట్ సంస్థ రూ.9 లక్షలు, యుటిఐ సంస్థ రూ.7.96 లక్షలు, డెలాయిట్ రూ.7.86 లక్షల వార్షిక వేతనాన్ని ఆఫర్ చేసినట్లు డైరక్టర్ తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికైన విద్యార్థులను గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ అమిత్‌భద్ర అభినందించారు. రానున్న నెలలో హిందుస్థాన్ లీవర్, నెస్లే, కోల్గేట్ పామోలీవ్, టర్నింగ్ మైండ్స్, ఫరఫెట్టీ మరికొన్ని సంస్థలు ప్రాంగణ నియామకాలను నిర్వహించనున్నాయని వెల్లడించారు.

ఎంపికైన విద్యార్థులలో ఎంబిఎ విద్యార్థిని సాహితీ ప్రయాగా మాట్లాడుతూ గీతంలో అందించిన నైపుణ్య శిక్షణ ద్వారా డెలాయిట్‌లో మొదట సమ్మర్ ఇంటర్న్‌షిప్ లభించిందని, తద్వారా రూ.11.59 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించడానికి ఉపయోగపడిందన్నారు. సీషెల్ లాజిస్టిక్స్ కంపెనీలు ఉద్యోగం సాధించిన పసుపులేటి ధనుష్ మాట్లాడుతూ ఇంటర్వ్యూలను ఎదుర్కొనే విధానం, గీతం అధ్యాపకుల శిక్షణ తనకు ఉపయోగపడ్డాయని తెలిపారు. ఎంబిఎ విద్యార్థులు టి.భవ్యమానవి, కర్ర సాయిరామ్ తాము ఉద్యోగాలు సాధించడంలో గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ అందించిన శిక్షణ, మార్గదర్శకం మరవలేనిదని పేర్కొన్నారు.